


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



గురువారం 25 సెప్టెంబర్ 2025 | చిత్తూరు | సంపుటి: 01 - సంచిక : 120 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## వాణిజ్య విభాగం..

# ఆకస్మిక దాడులు..!

■ కోట్లల్లో పన్నుల ఎగవేతలు ■ అల్యూమినియం మార్కెట్లో విస్తృత తనిఖీలు .. ■ వ్యాపార రికార్డులు సీజ్




**విజయవాడ ప్రతినిధి -సూర్య వాస్తవం**

విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ ప్రస్తు తానికి జూలు విదిలించింది. రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువు దీరిన చాలా కాలం తరువాత నిస్తేజాన్ని వీడి, ఎట్టకేలకు శాఖాపరమైన ఆదాయంపై దృష్టి సారించింది. ఏళ్లుగా వాణిజ్య పన్నుల ఎగవేతలకు పాల్పడుతున్న వ్యాపారుల లావా దేవీలపై గుట్టుచప్పుడు కాకుండా ఇటీవల సమాచారం సేకరించింది. ఆ మేరకు వాణిజ్య పన్నుల శాఖ తనిఖీ బృందాలు తాజాగా నగరంలో.. సంయుక్త ఆపరేషను చేపట్టాయి. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఆ బృందాలు .. గవర్నర్ పేటలోని అల్యూమినియం హోల్ సేల్ మరియు రిటైల్ షాపుల్లో సోదాలు చేపట్టాయి. ఆ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. ఏకాబికిన కొన సాగుతున్న దాడుల్లో బుధవారం రాత్రి వరకు తనిఖీ బృందాలు.. ఓ అల్యూమినియం షాపులో కీలక సమాచారాన్ని రాబ ట్టాయి. చాలా కాలంగా పన్నులు ఎగవేస్తున్న వైనాన్ని ఆధారాలతో సహా సేక రించాయి. ఆ షాపులో రహస్యంగా దాచిన వాణిజ్య రసీదులను, ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. సం బంధిత షాపులో కోట్ల వ్యాపారం జరుగుతున్నా ఆస్థాయి పన్నుల చెల్లింపు లేకపోవడాన్ని గుర్తించి రికార్డులను భద్రపరిచాయి. అల్యూమినియం సంబంధిత వ్యాపార సంస్థలు అనేకం ఒకే తరహాలో పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నాయని తనిఖీ ప్రాథమికంగా గుర్తించాయి. మరోవైపు ఆకస్మిక తనిఖీలు వ్యాపారులను సర్దు బాటుకు ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నాయి. దక్షిణాదిన వాణిజ్య రాజధానిగా పేరొందిన బెజవాడ నగరంలో భిన్న రకాల వాణిజ్యంలో, ప్రతినిత్యం వందల కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. అయినా ఆ నిష్పత్తిలో గత ఎంతో కాలంగా వాణిజ్య పనులు నమోదు జరగడం లేదు. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారగణం మేల్కొని శాఖాపరమైన తనిఖీలకు పూను కోవడం, వాణిజ్య పన్నుల రాబడికి శుభ సూచకంగా ఉన్నతా ధికార వర్గాలు భావిస్తున్నాయి. నగర వాణిజ్య పన్నుల కమిషనర్ ప్రశాంత్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణ లో చేపట్టిన ఈ ఆకస్మిక తనిఖీలు మరికొంత కాలం ఇలాగే కొనసాగితే.. వ్యాపార, వాణిజ్య సంస్థాలో ఏళ్లుగా పాతుకు పోయిన అక్రమాలకు తెరపడి, ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆశించిన స్థాయికి రెట్టింపు రాబడి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం ఆ శాఖనుంచే వ్యక్తమవుతోంది.



# వైభవంగా బ్రహ్మోత్సవాలు


**తిరుమల- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం 5.43 నుండి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగుర వేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, పరివార దేవతలైన శ్రీఅనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, కంకణ బట్టర్ వేణుగోపాల దీక్షితులు, ఇతర బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

**శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన బుధవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ముఖ్యమంత్రి శ్రీబేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ చైర్మన్


- మిగతా 2లో..



**శ్రీవారిని దర్శించుకున్న భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్**

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# తిరుమల పవిత్రత.. పరిరక్షణే ప్రాధాన్యం

◆ దేశవ్యాప్తంగా రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు

◆ స్వామివారి సేవకులు అతి పెద్ద సంపద


◆ అన్నప్రసాదాలను అన్ని టీటీడీ ఆలయాల్లో అందించేందుకు చర్యలు

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు

**తిరుమల- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24**

తిరుమల పవిత్రత, పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శిం చుకున్న అనం తరం, బుధవారం సాయంత్రం రంగనాయకుల మండపం నుండి భక్తులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "ముఖ్యమంత్రిగా పట్టు వస్త్రాలు సమర్పించే అరుదైన అవకాశం స్వామివారు పలుమార్లు ప్రసాదించారన్నారు. అలిపిరి ఘటనలో నా ప్రాణాలను రక్షించడం కూడా ఆయన సంకల్పమేనని నేను గాఢంగా విశ్వసిస్తున్నానని అన్నారు. అన్నప్రసాదంపై మాట్లాడుతూ, దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం దివంగత ఎన్.టి.రామారావు ప్రారంభించిన ఈ సత్కార్యం నేడు అనేక రెట్లు విస్తరించి, ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందజేస్తోందని పేర్కొన్నారు. ఈ సేవను అన్ని టిటిడి ఆలయాలకు విస్తరించాలని టిటిడి చైర్మన్, బోర్డు సభ్యులు, అధికారులను ఆయన కోరారు. శ్రీవాణి ట్రస్ట్ ఇప్పటివరకు రూ.2,038 కోట్లు విరాళాలు అందిందని, అందులో రూ.837 కోట్లు ఆలయ


- మిగతా 2లో..

### శ్రీవారికి ముఖ్యమంత్రిచే

# పట్టువస్త్రాలు

(మొదటిపేజీ తరువాయి)


బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. ఆ తరువాత ముఖ్యమంత్రి ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదమంత్రోచ్ఛారణతో వేద పండితులు ఆశీర్వదించారు. టీటీడీ చైర్మన్, ఈవో లు ముఖ్యమంత్రికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా 2026 ఏడాది టిటిడి డైరీలు, క్యాలెండర్లను గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఆవిష్కరించారు. అనంతరం ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ముఖ్యమంత్రివర్యులు స్వామి వారి పెద్దశేష వాహన సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు టిటిడి బోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.














### తిరుమల పవిత్రత..

# పరిరక్షణే ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణానికి ఖర్చు చేశారు. రూ.200 కోట్లకుపైగా వడ్డీ రూపంలో కూడా వచ్చాయన్నారు. ఐదు వేల ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 29 రాష్ట్రాల రాజధానులలో శ్రీవారి ఆలయాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని, వివిధ దేశాల్లో శ్రీవారి భక్తులు అధికంగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని సూచించారు. శ్రీవారిని ప్రపంచ వ్యాప్తంగా ఆరాధించే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి దాతలు విస్తృతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తనకు ప్రాణభిక్ష పెట్టిన రోజునే ఎస్‌వి ప్రాణదాన ట్రస్ట్ను టిటిడిలో ప్రారంభించామని గుర్తుచేశారు. ఇప్పటివరకు రూ.709 కోట్లు ఈ ట్రస్టుకు విరాళంగా వచ్చాయన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా పేదలకు, అవసరమైన రోగులకు వైద్య సహాయంగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో వైద్య సౌకర్యాలను అభివృద్ధి చేయాలని టిటిడిని కోరారు. స్వామివారి సేవకుల సేవలను కొనియాడుతూ స్వామివారి సేవకులు స్వామివారి నిజమైన సంపద అని, తిరుమల పవిత్రతను కాపాడే ఆవశ్యకతను ప్రజల్లో విస్తరించాల్సిన బాధ్యత వారిదేనన్నారు. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఈ సేవలో ఇప్పటివరకు 17 లక్షల సేవకులు 12 లక్షల మహిళలు, 5 లక్షల పురుషులుతిరుమల చేరే భక్తులకు అద్భుతమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా, సంతోషంగా, సంతృప్తిగా జీవించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం టిటిడి అన్నప్రసాదం, ఆలయ నిర్మాణం, ప్రాణదానం, స్వామివారి సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర హెచ్ ఆర్ డి , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పలువురు ఎమ్మెల్యేలు, టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# సెబీ పై నమ్మకం సన్నగిల్లింది

**- అదానీ ని వెనకేసుకురావడంలో ఆంతర్యమేమిటి ?**

**- డా. ముచ్చుకోట. సురేష్ బాబు**

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24:** 24 జనవరి 2023న, "షార్ట్–సెల్లింగ్"లో ప్రత్యేకత కలిగిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కంపెనీ షేరు ధర పడిపోతుందనే అంచనాతో దాని ధరపై పందెం వేయడం – అదానీ గ్రూప్ అకౌంటింగ్ అక్రమాలు, స్టాక్ మానిప్యులేషన్, షేర్ ధరలను పెంచడానికి ఆఫ్‌షోర్ షెల్ కంపెనీలను ఉపయోగించిందని ఆరోపిస్తూ 106 పేజీల నివేదికను ప్రచురించింది. గత వారం ఈ ఆరోపణలలో కొన్నింటిని సెబీ తోసిపుచ్చింది, దాని నిబంధనల ప్రకారం, అదానీ కంపెనీలు, సంబంధిత పార్టీల మధ్య ఎటువంటి లావాదేవీలు జరగలేదు. అందువల్ల, పెట్టుబడిదారులకు బహిర్గతం చేయవలసిన అవసరం లేదు, అవి మార్కెట్ మానిప్యులేషన్‌కు కారణమని పేర్కొంది. డబ్బులు దారి మళ్లించినట్లు లేదా నిధులను మళ్లించినట్లు లేదా పెట్టుబడిదారులు డబ్బును కోల్పోయినట్లు ఎటువంటి ఆరోపణలు లేవని కూడా సెబీ పేర్కొంది. అదానీ కంపెనీలు ఏదైనా సంస్థ నుండి తీసుకున్న రుణాలను దర్యాప్తు ప్రారంభానికి ముందే తిరిగి చెల్లించారని కూడా సెబీ పేర్కొంది. యోగ్యత ఆధారంగా, నిందించబడిన లావాదేవీలను తారుమారు లేదా మోసపూరిత లావాదేవీలు లేదా అన్యాయమైన వాణిజ్య పద్ధతులుగా వర్గీకరించలేమని వై కూడా నిర్ధారించబడింది. రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం, సెబీ అదానీ సంస్థలపై రెండు అభియోగాలను తొలగించింది, కానీ ఇన్‌సైడర్ ట్రేడింగ్ నుండి పబ్లిక్ ఫ్లోట్ ఉల్లంఘనల వరకు 22 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. గత సంవత్సరం, షార్ట్–సెల్లర్ సెబీ మాజీ చీఫ్ మాధబి పూరి బుచ్ అదానీ గ్రూప్ ఉపయోగించే ఆఫ్‌షోర్ నిధులతో సంబంధాలు కలిగి ఉన్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మే నెలలో, భారతదేశ అవినీతి నిరోధక వాచ్‌డాగ్ హిండేబర్గ్ ఆరోపణల ఆధారంగా ఆమెపై మోపబడిన అన్ని అవినీతి ఆరోపణల నుంచి ఆమెను తొలగించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో, హిండేబర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకురాలు నేట్ ఆండర్సన్, కంపెనీని ప్రారంభించిన ఎనిమిది సంవత్సరాల తర్వాత దానిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదికతో ప్రపంచం యావత్తూ గగ్గోలు పెట్టగా సెబీ ఆ కీలక ఆరోపణల్ని తోసిపుచ్చడం దారుణం. మన దేశంలోని అతి ముఖ్యమైన రెగ్యులేటరీ సంస్థ సైతం అదానీ తదితర కార్పొరేట్లకు అనుకూలంగా మారిందనడానికిది తాజా తార్కాణం. "అదానీపై హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరూపణ కాలేదు. అదానీ గ్రూప్ కంపెనీలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఆ సంస్థపై జరిమానా విధించాల్సిన అవసరం లేదు." అని సెబీ హోల్ టైం మెంబర్ కమలేష్ చంద్ర వర్షనేరు తన ఆర్డర్‌లో పేర్కొనడం దిగజారుడు తనానికి నిదర్శనం. దీంతో అదానీ పోర్ట్స్, అదానీ పవర్, గౌతం అదానీ, రాజేష్ అదానీలపై కొనసాగుతున్న దర్యాప్తు కార్యకలాపాలకు సెబీ మంగళం పాడింది. అదానీ గ్రూప్ తన కంపెనీల ఆదాయాన్ని పెంచడానికి, షేర్ల ధరలను కృత్రిమంగా మార్చడానికి విదేశీ బినామీ, షెల్ కంపెనీలను వాడుకుందని, అదానీ తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అప్పట్లో వెల్లడించింది. ఆ దెబ్బతో ఆ సమయంలో స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు కంపెనీల విలువ దాదాపు లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ ఆర్థిక అక్రమాలను నిశితంగా పరిశీలించామని, సాక్ష్యాలను సంపాదించామని, దాదాపు 100 పేజీల సాక్ష్యాలను రిపోర్ట్‌లో హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయినా అవేవీ సెబీ విచారణలో అక్కరకు రాలేదు. లేదా వాటిని చూడ నిరాకరించినట్టుంది. ఏలినవారి మద్దతుగల శత కోటీశ్వరుడు తప్పు చేశారనీ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారనీ సెబీ చెప్పగలదా? ముమ్మాటికీ అలాంటిది అసంభవమని గత పదేళ్ల చరిత్ర చెబుతోంది.

అప్పటి సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్‌కు అదానీ గ్రూపు సంస్థలతో ఉన్న అక్రమ ఆర్థిక సంబంధాన్ని సైతం హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారం అంటూనే బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు బుచ్ ఫ్యామిలీ అంగీకరించిన విషయం లోకానికెరుకే! తన భర్త బాల్య స్నేహితుడు నిర్వహిస్తున్న ఫండ్‌లోనూ పెట్టుబడులు పెట్టారని మాధాబి అప్పట్లో ధృవీకరించారు. 'అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్మన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయి. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుంది.' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అదానీ కంపెనీలతో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధాబి చరిత్ర ఇదే. దేశంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక వ్యవహారాలను నియంత్రించవలసిన సంస్థకు అధినేతలుగా అటువంటి వ్యక్తులను నియమించడంలోనే అసలు తిరకాసు ఉంది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు క్రమంలో దేశంలో కార్పొరేట్లు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకుల మధ్య బలమైన బంధం ఏర్పడింది. ఆ బంధం గత పదకొండేళ్ల నరేంద్ర మోడీ పాలనలో మరింతగా బలపడింది. అందుకే ఈ మూడు తరగతులకు చెందినవారు ఒకరినొకరు సమర్థించుకోవడం రివాజుగా మారింది. తాజా అంశం వాటిలో ఒకటి మాత్రమే! అదానీ సెకీ కుంభకోణం గురించి ఒకసారి గుర్తు తెచ్చుకున్నా ఈ విషయం అర్థం అవుతుంది. అదానీ గ్రూపు కార్పొరేట్లు, సెకీ, రాష్ట్ర విద్యుత్ రంగ ఉన్నతాధికారులు అప్పటి ప్రభుత్వాధినేతతో జరిపిన మంతనాలు, వేల కోట్ల రూపాయలు చేతులు మారడం, ఇవన్నీ ఒక్కసారి సినిమా రీల్ మాదిరి తిరుగుతాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అవినీతిపట్ల ఇప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఏమీ చెయ్యకుండా ఎందుకు మిన్నకుండిపోయారు? రోజూ బద్ధ శత్రువుల్లా వ్యవహరించే వీరిద్దరికీ మిత్రుడు మోడీ తన అనుంగు మిత్రుడైన గౌతం అదానీని కాపాడారని లోకానికి తెలియనిది కాదు. కాబట్టి ప్రజల సొమ్మును, దేశ సంపదను కొల్లగొడుతున్న ఈ అపవిత్ర కూటమి మోసాన్ని జనం అర్థం చేసుకోవాలి. వాటిని ప్రతిఘటిస్తూ ఐక్య ప్రజా ఉద్యమాలు సాగాలి.

# మంత్రి లోకేష్‌ని కలిసిన నెలవల

**నాయుడుపేట, సూర్య వాస్తవం సెప్టెంబర్ 24** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును హెలి ప్యాడ్ వద్ద మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా.. ఏవండీ సుబ్రహ్మణ్యం గారు మీ ఆరోగ్యం ఎలా ఉంది. మీ ఫ్యామిలీ అందరూ బాగున్నారా అని నెలవలను లోకేష్ ఆప్యాయంగా పలకరించారు. నెలవల మాట్లాడుతూ.. మీ దయతో బాగున్నాను మీ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను అని తెలిపారు.



### చౌక దుకాణ డీలర్లకు

# అధునాతన ఈ-పోస్ యంత్రాలు

- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24 : జిల్లాలోని 1,645 చౌక ధరల దుకాణ డీలర్లకు పాత ఈ–పోస్ యంత్రాల స్థానంలో అధునాతన ఈ–పోస్ యంత్రాలు పంపిణీ చేయడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం నగరంలోని కృష్ణ కళామందిర్ లో ఆత్మకూరు, కూడేరు మరియు గార్లదిన్నె మండలాలకు సంబంధించిన చౌక ధరల దుకాణ డీలర్లకు కొత్త యంత్రాలను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆండ్రాయిడ్ మైక్రో కంట్రోలర్ ఆధారిత, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ గుర్తింపు, టచ్ స్క్రీన్ ఇంటర్ ఫేస్ డేటా ప్రాసెసింగ్ కలిగిన ఈ కొత్త యంత్రాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, ఖచ్చితమైన సేవలు, ప్రతి లావాదేవి రియల్ టైంలో నమోదు అవుతుందన్నారు. జిల్లాలోని 1,645 చౌక ధరల దుకాణ డీలర్లకు ఈ కొత్త యంత్రాలను 27వ తేదీలోగా అందజేసి అందుకు సంబంధించిన శిక్షణను అందరు డీలర్లకు ఇవ్వాలని విజన్ టెక్ ఇంజినీర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని అందరు తహసీల్దార్లు మరియు పౌరసరఫరాల డిప్యూటి తహసీల్దార్లు వారి వారి మండలాలలో కొత్త యంత్రాల పంపిణీ కార్యక్రమమును పర్యవేక్షించడం చేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పీ4 సర్వేను పక్కాగా నిర్వహించాలి



గాండ్లపెంట, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ4 సర్వేను పక్కాగా నిర్వహించాలని ఇన్చార్జ్ ఎంపీడీవో సునీత పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం బుధవారం గ్రామ సచివాలయాల సిబ్బందికి ఒక్కరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీ4 సర్వే కార్యక్రమాన్ని గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలని సూచించారు. అలాగే పి ఫోర్ సర్వేకి సంబంధించిన విధివిధానాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ట్రైన్ పర్సన్ సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం




లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్యర్యంలో జాతీయసేవాపథక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వేంపల్లి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సేవా భావంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే జాతీయ సేవా పథకం ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని కళాశాల పరిసర ప్రాంతాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలు చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సహదేవరెడ్డి, సుందరావు, శాంతయ్య, కళ్యాణి, అనూష మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మదనపల్లెలో భార్యపై భర్త హత్యాయత్నం



మదనపల్లె, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: మదనపల్లెలో భార్యపై భర్త సల సలా కాలే సాంబారు మీద పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కురవంకలో కాపురం ఉంటున్న రామాంజులు భార్య భారతి(25), జిల్లా ఆస్పత్రిలో రోగులకు డైట్ సరఫరా చేసే వీరభద్ర దగ్గర పనిచేస్తుంది. ఈ క్రమంలో సాయంత్రం విధులకు హాజరైన భార్యపై అనుమానం పెంచుకొన్న భర్త ఆస్పత్రి లోనే కాలే సాంబారు మీద పోసి హత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించి, చికిత్సలు అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా రామానుజులు భారతీయ దగ్గర ఉన్న పిల్లలను బలవంతంగా ఎత్తుకెళ్లాడని తన భర్త పిల్లలను ఏమైనా చేస్తాడని ఆమె ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజారెడ్డి తెలిపారు

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- డిఐఈపిసి సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు,బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి.. విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అయిన పారిశ్రామిక రంగాన్ని.. మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా.. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలను కున్న వారికి ఆర్థిక ప్రాత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు, పరిశ్రమల ప్రమోషన్‌కు సంబందించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపణపై అవగాహన పెంపొందించాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా క్రొత్తగా పరిశ్రమల స్థాపన కై వచ్చిన అనుమతులను సమీక్షించారు. వివిధ పరిశ్రమలకు సంబంధించి రాయితీలను మంజూరు చేయడం జరిగిందన్నారు. పెట్టుబడి రాయితీ కింద 7 పరిశ్రమలు రూ.196.14 లక్షలు, వడ్డీ రాయితీ కింద 1 యూనిట్‌కు రూ. 6.46 లక్షలు, విద్యుత్ రాయితీ కింద 1 యూనిట్‌కు రూ.5.41లక్షలతోపాటు స్టాంప్ డ్యూటీ రీయింబర్స్ మెంట్ ఫర్ ఒక పరిశ్రమకు రూ.1.65 లక్షలు మంజూరు చేశారు. జిల్లాలో ప్రపంచబ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ర్యాంప్ పతకము ద్వారా వివిధ అవగాహన సదస్సులును విజయవంతగా నిర్వయించాలని కలెక్టర్ ఆదేశించారు, ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. స్వయం ఉపాధి పథకాలకు శిక్షణలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భారత ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లాలో కొత్త క్లస్టర్లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అమలులో ఉన్న పెద్ద, మెగా పరిశ్రమల యూనిట్ల విజయవంతమైన గ్రౌండింగ్ కోసం వాటితో పర్యవేక్షణ మరియు సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం జె.నాగరాజ, జిల్లా ఫ్యాక్టరీల అధికారి రాధాకృష్ణ, ఏపీఐఐసీ జెడ్ ఎం, విద్యుత్ శాఖ ఏఈ, ఏపీఎస్ఎఫ్‌సి బ్రాంచ్ మేనేజర్ అన్సారీ, జిల్లా కల్యుషనివారణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ దాతృత్వం





గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: గోరంట్ల పట్టణం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణం లో ముళ్ళపొదలు, పిచ్చి మొక్కలతో వైద్య ఆరోగ్య సిబ్బంది,108 సిబ్బంది,రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారూ,రాత్రి వేళల్లో పాములు వస్తుండటంతో మెడికల్ ఆఫీసర్ అఫ్తబ్ మరియు డాక్టర్ వినోద్ కుమార్‌లు టీడీపీ మండల నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్‌కు సమస్యను తెలిపారు. దీంతో నిమ్మల శ్రీధర్ వెంటనే స్పందించి,జెసిబి వాహనం ద్వారా ముళ్ళ చెట్లు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు, ఆసుపత్రి ఆవరణం జేసీబీ ద్వారా తొలగించారు. దీంతో నిమ్మల శ్రీధర్ దాతృత్వానికి, ప్రజాసేవకు వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి,మైనార్టీ నాయకులు షేక్ అజ్మతుల్లా, డైరెక్టర్ నబీరసూల్, రవినాయక్,అమానుల్లా, కురుబ మహేంద్ర, మామిడి కాయల హరి ప్రసాద్, కలీమ్ ఖాన్, మహబూబ్ బాషా, నరేంద్ర, ముని, మహేష్, గంగం పల్లి సుబహన్ తో పాటు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు వరం 'కిసాన్ ధన్ ఆరోగ్య' పథకం



లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: రైతులు కిసాన్ ధన్ ఆరోగ్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పివి ఆర్ (గ్రూప్స్ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి మండలం పర్వతరెడ్డిగారి పల్లి, అప్పకొండయ్య గారి పల్లి, గంగనపల్లి లలో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. కిసాన్ ధన ఆరోగ్య యోజన ప్రయోజన పథకం రైతుల కోసం ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకం అని ఈ పథకం ద్వారా రైతులు సభ్యత్వం తీసుకోవడం వల్ల రైతుల సహాయం కోసం రైతులకు 25,000 వేలు వరకు రైతులకు పట్ట నష్టపరిహారం 50,000 ల వరకు రైతు ఏదైనా ప్రమాదం జరిగితే మూడు లక్షల వరకు ప్రమాద మరణం. పి టి డి, పి పి డి కవర్ చేయబడతాయి. మహిళలకు యూనిట్ 5 వేల రూపాయల నుండి 1 లక్ష రూపాయలు రుణ సౌకర్యం. మహిళా రైతులు వ్యవసాయ పరికరాలపై 30% వరకు సబ్సిడి. అలాగేఆర్గానిక్ ఫర్టిలైజర్స్ మీద 40% వరకు సబ్సిడీఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు సమూహానికి ప్రయోజనాలు – కోళ్ల పెంపకం, గోశాల, చేపల పంపకం, తేనెటి గల పెంపకం, కోల్డ్ స్టోరేజ్. గొడన్స్, మొదలుగున వాటికి రుణ సౌకర్యం కల్పించబడునని దీనికి సంబంధించిన పూర్తి వివరాల కోసం మీ మండల కోఆర్డినేటర్ ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కోఆర్డినేటర కే. మల్లికార్జున, కడప అన్నమయ్య జిల్లాల అవేర్నెస్ మేనేజర్ సంపత్, రాయలసీమ అవేర్నెస్ మేనేజర్ మణికంఠ, మేనేజర్ సాయి ఇంకా సంస్థ ప్రతినిధులు రమాదేవి హరికృష్ణ తేజ తదితరులు పాల్గొన్నారు. మండల కోఆర్డినేటర్లు పి తేజ, రహమత్ జాన్, శివ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు,

## మదనపల్లెలో బాంబు స్క్వాడ్ తనిఖీలు



మదనపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో బుధవారం మదనపల్లె డిఎస్పీ మహీంద్ర సూచనల మేరకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, చిత్తూరు బస్టాండు, బెంగళూరు బస్టాండు, గవర్నమెంట్ హాస్పిటల్ తదితర ప్రాంతాలలో బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ కోసం అనుమానిత ప్రదేశాల్లో బాంబు, డాగ్ స్క్వాడ్ తో దుకాణాలు, రద్దీ ప్రదేశాలు, బస్టాండ్ ల వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు

## క్రీడా దుస్తుల వితరణ



మదనపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: మదనపల్లె జెడ్పి హైస్కూల్లో అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ జిల్లా జూనియర్ జట్టుకు బుధవారం క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మెన్ జునైద్ అక్బరీ, ఏకే ఎలివేటర్స్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోటకళ్యాణ్, జనసేన పార్టీ నిమ్మనపల్లి అధ్యక్షులు ప్రదీప్ లు క్రీడా దుస్తులు వితరణగా అందజేశారు. రూ. పదివేల విలువ గల క్రీడా దుస్తులు వితరణ చేయడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం




గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ జూనియర్ కళాశాల మరియు ఎస్ పి వి ఎం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఎన్ ఎస్ ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం అధ్యక్షతన కళాశాల ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు ఆజాద్, బాల మోహన్ ల పర్యవేక్షణ లో నిర్వహించారు, ఎన్ ఎస్ ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోరంట్ల గవర్నమెంట్ హాస్పిటల్ లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 10 మంది కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు రక్తదానం చేశారు, అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు 57 వ జాతీయ సేవా పథక దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు కళాశాల విద్యార్థులు మరియు కళాశాల అధ్యాపకులు అరవింద్, కవిత, అర్షియ, గోవింద్, లక్ష్మీ, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

- మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్

గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో దేశ చిత్రపటంలో భారతదేశ నెంబర్ వన్ గా అభివృద్ధి చెందుతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనతి కాలంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతుందని శ్రీ సత్య సాయి జిల్లా బీజేపీ అధ్యక్షుడు జిఎం శేఖర్ తెలిపారు, ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా జరుగుతున్న సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గోరంట్ల మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో గోరంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిఎం శేఖర్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో 100 మంది యువకులు




పాల్గొని రక్తదానం చేశారు, యువకులకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సర్టిఫికెట్ తో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించనున్నామని రెడ్ క్రాస్ చైర్మన్ జి యం. శేఖర్ తెలిపారు,ఈ కార్యక్రమంలో విద్యార్థులు యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు, ఈ



కార్యక్రమంలో డాక్టర్ అఫ్తాబ్,వినోద్ కుమార్ , అసెంబ్లీ కన్వీనర్ మేదర శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యా ధరణి, మాజీ సర్పంచ్ నరేష్, ఉత్తమ రెడ్డి, నిమ్మల శ్రీధర్, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, షేక్ అజ్మతుల్లా, డైరెక్టర్ నబీరసూల్, అనిల్ కుమార్, సేవా పక్వాడ్ కార్యక్రమాలు ఇంచార్జ్ పూల గంగాధర్, కో ఇన్చార్జు వెంకటాచలం, శంకర్ రెడ్డి, నాగరాజు యాదవ్ , ముంతాజమ్మ, లక్ష్మి దేవమ్మ, కాచర్ల హరీష్, భజంత్రీ శంకర అశోకు శంకర్ రెడ్డి వెంకటేష్ పార్వతి బాయి, గంగం పల్లి సుబహన్, కురుబ మహేంద్ర, కలీమ్ ఖాన్, మామిడి కాయల హరి ప్రసాద్, అమానుల్లా,ఉస్మాన్ ఖాన్,లక్ష్మి శాంతమ్మ, బిజెపి తెలుగు దేశం, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓజీ టికెట్‌ను రూ.20వేలకు దక్కించుకున్న మెగా వీరాభిమాని మునిస్వామి



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఒరిజినల్ గ్యాంగ్ స్టార్ (ఓజీ) సినిమా మొదటి టికెట్ వేలం పాటలో గోరంట్ల మండల కేంద్రానికి చెందిన మెగా వీరాభిమాని డి జే. మునిస్వామి రూ.20వేలకు వేలం పాటలో దక్కించుకొని పవన్ కళ్యాణ్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని చంద్రశేఖర్ థియేటర్ కాంప్లెక్స్ లో పవన్ కళ్యాణ్ నటించిన ఓజి సినిమా విడుదల నేపథ్యంలో థియేటర్ ఆవరణలో బుధవారం పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం నాయకులు చిలమత్తూరి వెంకటేష్, పాగు తోట వెంకటేష్, గాజుల రమేష్, సురేష్, బీజేపీ నరసింహులు తదితరుల నేతృతంలో జరిపిన వేలంపాటలో డీజే మునిస్వామి మొదటి టికెట్ను 20వేలకు వేలం పాటలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా థియేటర్ నిర్వాహకులు విజయ్ శేఖర్ (బాబు) మొదటి టికెట్ ను అందజేయగా తోటి అభిమానులు మునిస్వామికి పూలమాలలు వేసి అభినందించారు.

## ప్రత్యర్థుల దాడి: వృద్ధ రైతు ఆత్మహత్యాయత్నం



మదనపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: భూ వివాదంతో తలెత్తిన గొడవలో ప్రత్యర్థులు దాడి చేశారన్న కోపంతో ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మ హత్యకు యత్నించాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసులు, బాదితుని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు పోలీసుల కథనం.. మండలంలోని యనమల వారిపల్లికి చెందిన కోలా రెడ్డప్ప (80)కి చెందిన వ్యవసాయ భూమిలో భాగం పంచాలని అదే ఊరికి చెందిన ప్రత్యర్థులు వేణు వర్గీయులు రెడ్డప్ప పొలం వద్దకు దౌర్జన్యంగా వెళ్లి గొడవపడ్డారు. మాట మాట పెరిగి వృద్ధ రైతు రెడ్డప్ప పై కర్రల తో దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. దాడిని అవమానంగా భావించి తీవ్ర మనస్థాపం చెందిన రైతు పొలం వద్ద ఉన్న పురుగు ల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు గమనించి బాదితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స అనంతరం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

## ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్




గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టపర్తి జనసేన పార్టీ ఇంచార్జ్ పత్తి చంద్రశేఖర్ బుధవారం విజయవాడలోని ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మండల జనసేన మండల కన్వీనర్ ఎం. సంతోష్ కుమార్ శాలవలతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పంటకోతపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ



గుత్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: గుత్తి మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించడానికి క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సంవత్సరంలో పంటకోత ప్రయోగాలను నిర్వహించేందుకు సూచనలు చేయాల్సిన పద్ధతి తెలియజేయడమైనది. ఈ పంటకోత ప్రయోగాలతో వచ్చిన ఫలితాలు వినియోగించి జిల్లా, రాష్ట్రస్థాయిలో పంట దిగుబడి అంచనా వేయుటకు,పంటలవారీగా ఉత్పత్తి అంచనా వేయుటకు, ప్రధానమంత్రి ఫసల్ భీమల యోజన(పి.ఎం.ఎఫ్.బి.వై) అమలు పర్చడానికి, కరువు మండలాలను ముందస్తు అంచనాలు తెలియచేయుటకు, వ్యవసాయానికి సంబంధించిన రాష్ట్రీయ, జాతీయ స్థూల ఆదాయం అంచనా వేయుటకు, పంటలవారీగా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకో వడం చాలా ప్రధాన పాత్ర పోషిస్తుందని ఏఎస్ఓ శ్రీమివాస నాయక్ తెలిపారు. గుత్తి ఎడిఎ వెంకటరాముడు గారు ఎంఎఓ ముస్తాక్ అహమ్మ ద్ ఎ ఎస్ ఓ శ్రీనివాస్ నాయక్, గుత్తి ఆర్ఎస్‌కె స్టాఫ్ పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి



పెళ్ళకూరు, సూర్య వాస్తవం సెప్టెంబర్ 24: తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం చిల్లకూరు గ్రామానికి చెందిన మాజీ ఎన్డీసీసీబీ చైర్మన్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తాడేపల్లిలోని వైఎస్ఆర్సిపి పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

**గ్రీన్ సత్యసాయి జిల్లాగా తీర్చిదిద్దాలి - బొకేలు వద్దు, పూల మొక్కలు ముద్దు - జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్**





పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించి జిల్లాను గ్రీన్ సత్యసాయి జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు, బుధవారం కొత్తచెరువు మండలం జానకి రామయ్య కాలనీ నందు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్యక్రమంలో భాగంగా కోటి మొక్కలు నాటే అంకురార్పణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో విరివిగా మొక్కలు నాటాలని బాధ్యతగా వాటిని సంరక్షించి చెట్లు అయ్యేంతవరకు దత్తత చేసుకోవాలని అన్నారు,తొలుత భగవాన్ శ్రీ సత్య సాయి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు,అనంతరం కోటి మొక్కలు నాటే అంకురార్పణ కార్యక్రమానికి తొలుత కలెక్టర్ వృద్ధురాలు అయినా వెంకట లక్ష్మమ్మ ఆధీనంలో ఉన్న భూమిలో మొక్కలు నాటించి ప్రారంభించారు. అలాగే ఈ ప్రాంతానికి వెంకట లక్ష్మమ్మ తోట పేరుతో నామకరణం చేశారు,ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్ఓ శ్రీనివాసులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇంచార్జ్ పిడి శ్రీలక్ష్మి, ఏపీడి జ్యోతి, జడ్పీ డిప్యూటీ సీఈవో జె వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో నటరాజ్, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోమందేపల్లి, పరిగి పోలీస్ స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు



పెనుకొండ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: పెనుకొండ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లోని రిసెప్షన్ కౌంటర్ , రికార్డుల నిర్వహణ, లాకప్ గదులు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, అలాగే ట్రాఫిక్ నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు,వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు, ద్విచక్ర వాహనాల కేసు వివరాలను ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిం చారు. పోలీసు స్టేషన్‌లకు సంబంధించిన ఫైళ్లను, పలు రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు, కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు, లాంగ్ పెండింగ్‌లో ఉన్న కేసులు పరిస్థితులను, రికార్డులను క్షుణంగా తనిఖీ చేశారు. డయల్ 100,112 కి వచ్చే కాల్స్ కి కాలర్ దగ్గరికి వెళుతున్నారా లేదా అని సిబ్బంది ద్వారా ఆరాతీశారు, స్టేషన్ పరిధిలో నేర, శాంతి భద్రతల గురించి అడిగి తెలుసుకొా వడంతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు, మిస్సింగ్ కేసులు ఛేదన, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలన్నారు, చోరీలు జరగకుండా రాత్రివేళల్లో గస్తీలు ముమ్మరం చేసి పెట్రోలింగ్ నిర్వహించా లన్నారు, విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు, పోలీస్ సిబ్బంది విధులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు,మీ సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాన న్నారు, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మెలగాలని మహిళలు, బాలికల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాల న్నారు, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెంచేవిధంగా పోలీస్‌సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీవెంట పెనుగొండ సీఐ రాఘవన్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

## గుత్తిలో మట్కా బీటర్లు అరెస్ట్





గుత్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24:గుత్తి మున్సి పాలిటీ పరిధిలో రాబడిన సమాచారం మేరకు ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో బుధవారం గుత్తి టౌన్ లోని అమృత్ టాకీస్ వెనకాల ఎస్సీ కాలనీ నందు మట్కా నిర్వహి స్తున్నారన్న సమా చారం అందడంతో పోలీస్ సిబ్బం దితో దాడులు నిర్వహించి మాతంగి రాము, మాతంగి ఎల్లమ్మ, బెస్త రామాం జనేయులు అను ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.253 00/- మరియు మట్కా చీటీలను స్వాధీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు వెంటనే పంపండి

- **జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**





రాయచోటి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏపీఎస్పీసీఎల్) వారికి లీజ్ ప్రాతిపదికన భూముల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యా లయం నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ కేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం గతంలో భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించారు. ఈ గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ సంబంధించిన తూము గుంట, వెలిగల్లు కు సంబంధించిన లీజ్ ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తయారుచేసి ఫైళ్లను వేగవంతం చేయాలని, శనివారం లోపు నివేదికలను పంపే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యమే కుటుంబ శ్రేయస్సుకు పునాది





పెళ్ళకూరు, సూర్య వాస్తవం సెప్టెంబర్ 24: తిరుపతి పార్లమెంట్ సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలంలోని పాలచ్చూరు గ్రామంలో స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దల నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ "మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే కుటుంబం సుభిక్షంగా ఉంటుంది. మహిళ సాధికారతతోనే సమాజం బలోపేతం అవుతుంది" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ మండల అధ్యక్షులు గోగుతాట్టు మురళి, జీఎస్ ఈ.రమణయ్య, వి.భారత్ కుమార్, సీనియర్ నాయకులు ఎం.వీరయ్య, సక్కి, వెంకట్.ఎన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం




అన్నమయ్య, బ్యూరో సూర్య వాస్తవం, సెప్టెంబర్ 24: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నాడు ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని బుధవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి పట్టణానికి చెందిన నవ్యత క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్.చమర్తి నవ్యత ఎంబిబిఎస్ ఎండి( డెర్మటాలజీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్యత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థనారి- శశక్తు పరివార అభియాన్ పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళల ఆరోగ్యం కోసం అనేక చర్యలు చేపట్టిందని, వివరిస్తూ ప్రతి కుటుంబంలో మహిళ ఆరోగ్యకరంగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, మహిళ సాధికారత సాధించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజలోఉంటుందని అభిప్రాయపడ్డారు. పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం యోగ, సమీకృత ఆహారం, రెగ్యులర్ హెల్త్ చెకప్ అంశాలపై సూచనలు సలహాలు వివరించారు. కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్ మాట్లాడుతూ విద్యార్థున దశలో జాతీయ సేవా పథకం ప్రతి విద్యార్థి జీవితాన్ని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందని వివరించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ పథకం ద్వారా విద్యార్థుల్లో సేవా గుణాన్ని అలవర్చి, సమాజంలో ఐక్యత ఏర్పరిచి, ఆచార సంప్రదాయాలు పై అవగాహన ఏర్పరిచి గౌరవప్రదమైన పౌరునిగా తీర్చిదిద్దుతుందని వివరించారు. మహిళలకు స్వేచ్ఛ స్వతంత్రాలను కల్పించినప్పుడు అన్ని రంగాల్లో దేశం ప్రగతి సాధిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ సభ్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథిని మరియు విశిష్ట అతిథిగా హాజరైన ప్రజా చైతన్య సేవా సంఘం అధ్యక్షురాలు తుమ్మల స్వాతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

